ఆమె విశాల నయనాలు బాధతో ముకుళించాయి.

'టప్' మంటూ పడ్డాయి కన్నీటిచుక్కలు.

"అమ్మా!" ఆశ్చర్యంగా, ఆందోళనగా అన్నది వైదేహి.

"నీకు ఎలా చెప్పేది, పాపా! నేను ఎంతో అనుభవంమీద తెలుసుకున్న సత్యమిది. ఏ వయస్సులో ఆ బాధ్యతల్ని నెరవేర్చాలి. పాలపొంగులాంటి ఈ తరుణంలో భవిష్యత్తులో ఎదురయే పరిస్థితులను గూర్చి ఆలోచించే శక్తి, ఓపిక ఉండవు. అన్నీ అనుకూల పరిస్థితులున్న జీవితంలో ఎన్నో సాధించవచ్చును. ప్రతికూల వాతావరణంలో మనలాంటి స్త్రీలు ఏమీ చెయ్యలేరు. విధికి తలఒగ్గటమే శరణ్యమవుతుంది."

"నీవు చెప్పేది నా కర్థంకావటంలేదమ్మా. అసలు నీ వీ రోజు అదోలా ఉన్నావు."

జయప్రద మాట్లాడలేదు. ఏవో జ్ఞాపకాల తెరలు అలలుగా లేస్తున్నా యామెలో. ఎన్నో ఏళ్ళుగా అణిచిపెట్టుకున్న ఆశయాలు గోలగా అరుస్తున్నాయి. ఇన్నాళ్ళుగా దరికి రానీయని ఆలోచనలు తూనీగల్లా ఒక్కసారి ముసురుకున్నాయి.

బయట వాతావరణం చల్లగా చెమ్మగా ఉంది.

ముసురుపట్టిన ఆకాశం ఉండీ ఉండీ మెరుస్తూంది.

సన్నని జల్లు పన్నీటిజల్లులా ఆహ్లాదపరుస్తూంది, చూసేవాళ్ళ మనసులకు.

గాలి కిటికీలోంచి దూసుకువచ్చి జయప్రద ముంగురుల్ని మృదువుగా తాకుతూంది. గదిలో ఇరువురి మధ్యా నిశ్శబ్దం చూపులు మార్చుకుంటూంది.

కిటికీలోనుంచి బయట వర్షపుజల్లులోకి సాలోచనగా చూస్తున్న జయప్రద ఎందుకో నిట్టూర్చింది.

"పాపా! నీ కో కథ చెబుతాను. వింటావా?"

తల్లివైఖరిని నిశితంగా పరిశీలిస్తూ అర్థంకాక సతమతమవుతూన్న వైదేహి చెప్పమన్నట్లు తల ఆడించింది.

* * *

ఆ రోజుల్లో పూర్తిగా సనాతనఛాందసాలు రాజ్యం చేయటంలేదు. అలా అని నవీన నాగరికత చలామణీ కావటమూలేదు. పూర్వపు కట్టుబాట్లకు లొంగి, ఆడదాన్ని బయటప్రపంచాన్ని చూడనీయని చండశాసనులూ ఉన్నారు. కొద్దికొద్దిగా తెలివినపడి, స్త్రీకి ఒక మనసు ఉన్నది అనీ, కోరికలు ఉన్నాయనీ గ్రహించి కొంచెం స్వాతంత్ర్యం, విద్యావకాశం కల్పించిన ఉదారత్వంగల ధీరోదాత్తులూ ఉన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే పాతకొత్తల కలనేత చీరలాంటిది ఆ కాలం.

రాధ తలిదండ్రులు పూర్వపు ఆచారాలకు విలువ ఇచ్చేవారు.

పన్నెండేళ్ల రాధ వయసు అభం, శుభం తెలియనిది. ఆ ఈడులోని ప్రపంచం చాలా చిన్నది. ఇరుగుపొరుగు పిల్లలతో ఆటలతో, పాటలతో దొర్లిపోతున్నకాలం హఠాత్తుగా స్తంభించింది. రాధను మూల కూర్చోమని తల్లి మందలించింది. అర్థంకాని రాధ అయోమయంగా తల్లి ఆజ్ఞ పాటించింది. కానీ ఆ సంఘటనతో తన జీవితమే తల్లకిందులవుతుందనే సంగతి గ్రహించలేదు. ఒకటే లక్ష్యం! తోటి క్లాసుపిల్లలలో పైచేయిగ ఉండాలి. ఎక్కడా తప్పకుండా మంచిపేరు తెచ్చుకోవాలి. పదిరోజులదాకా ఆ బందిఖానా వదలలేదు రాధకు. ఆ

*ఆడదానికి కన్నీరే వరప్రసాదం. ఆ కన్నీరు మనసులోని ఆవేదనలను కడిగివేస్తుంది. కాకుంటే స్త్రీ తనలోని అభిజాత్యానికి, బాధలకు, నైరాశ్యానికి, అవమానాలకు క్రుంగి, నీరసించిపోతుంది. ఒక్కసారి ఆ కన్నీటిబొట్లు స్వాతి చినుకులై ముత్యాలను సృష్టించ గలవు.*

---

పదిరోజులూ పేరంటం, పాటలూ, చిమ్మిలీ!

మరో నాలుగు రోజులు పోయాక రాధ తన స్నేహితురాలు ప్రభతో స్కూలుకి బయల్దేరిన సమయంలో ఒక గాలివాన రేగింది.

"అయ్యో! ఇదెక్కడి విడ్డూరమే!" బామ్మ బుగ్గలు నొక్కుకుంది.

సన్నగా చివాట్లు మొదలైనాయి.

# ఆరని ఆశలు

"ఇంకా ఇస్కూలేమిటే, రాధమ్మతల్లీ! నీకేం మతిపోయిందా? చాల్లే. ఇంట్లోకి నడు!"

తల్లిమాటలు వింటూ మౌనంగా ఊరుకున్నారు అవధానిగారు, పడకకుర్చీలో పేపరు చదువుకుంటూ.

రాధ రిచ్చపడిపోయింది. కళ్లముందు చీకటితెరలు కదిలాయి. ఏం చేయాలో తోచని పరిస్థితి. ఎంతో ఉత్సాహంతో పరుగులిడిన మనస్సు స్తంభించిపోయింది. ఏదో పనిమీద అక్కడికి వచ్చిన తల్లి అన్నపూర్ణవైపు చూసింది రాధ జాలిగా, ఏదో ఆశ మిణుకుమనగా. అన్నపూర్ణ అనునయంగా నవ్వింది.

"ఇక ఇలా వెళ్లకూడదమ్మా!. పెద్దదానివయ్యావు కదూ! వెళితే అంతా నవ్వుతారు. ఇదివరకులా ఆటలు, అల్లరి పనికిరాదు, తెలుసా?" అన్నపూర్ణ నెమ్మదిగా బోధించింది.

రాధ హృదయంలో ములుకుల్లా గుచ్చుకున్నా యా మాటలు.

అయితే . . . అయితే తన బ్రతు కింతేనా? తన చదువింతటితో ఆగిపోవలిసిందేనా? ఎంతో చదివి విజ్ఞానం నేర్చుకోవాలనే ఈ తృష్ణ ఎలా చల్లార్చుకోటం? నీళ్లతో నిండిన కళ్లను పైకెత్తి "నా కింట్లో ఏం తోస్తుందమ్మా? వెళతానమ్మా!" జాలిగా అర్థించింది,

---

**గొల్లపూడి రాజ్యలక్ష్మి**

---

కొనఊపిరితో ఉన్న ఆశ ప్రోత్సహించగా.

"రాధా! పెంకెతనం మానేయ్. ఇంటికి పెద్దదానివి. ఆమాత్రం జ్ఞానం ఉండక్కర్లా? నన్ను విసిగించకు!" అన్నపూర్ణ విసుగ్గా వంటఇంట్లోకి వెళ్లిపోయింది.

బిక్కమొహం వేసుకుని పొంగివస్తున్న దుఃఖాన్ని నిగ్రహించుకుంటూ రాయిలా నిలబడింది రాధ.

అవధానిగారు కళ్లజోడు సవరించుకొంటూ రాధ వైపు చూసి జాలిపడ్డారు.

"అమ్మ చెప్పినట్లు విను, రాధా! మంచిదానవు కదమ్మా!"

నిస్సహాయురాలు రాధ నిట్టూర్చింది. ఆమెలోని ఆశ ఓడిపోయి ఎక్కడికో ఎగిరిపోయింది. మనసులోని కోరిక రూపుమాసిపోయింది. నిస్తేజంగా తన గదిలోకి వెళ్లి చేతిలోని పుస్తకాల్ని గుండెల కదుముకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

రాధలోని అలజడినీ, మనస్సంక్షోభాన్నీ అర్థం చేసుకున్న అవధానిగారు ఆ బాధకు ఓదార్పు ఏడుపొక్కటే అనే నిశ్చయంతో రాధదరికి ఎవరినీ చేరనీయలేదు.

రాధ కోరిక ఆయన మనసులో సమంజసమే అనిపించినా, తన చుట్టూ ఉన్న సంఘానికి జడిసి అంతకుమించి పాతభావాలకు ప్రతిరూపమయిన తన తల్లిని ఎదిరించలేక అసహాయంగా నిట్టూర్చారు. పెద్దమనిషి అవకమునుపే కన్యాదానం చేయలేదని అప్పటికే సూటీపోటీగా ఇరుగుపొరుగు పరిచితులు, బంధువులు అంటూఉన్నారు. ఇంటిలో తల్లి పోరు చెప్ప నవసరమేలేదు.

ఏడ్చి, ఏడ్చి అలిసిపోయిన రాధ మనసులో నిర్లిప్తత ఆవరించింది. గది కిటికీలోనించి తన స్నేహితురాలు ప్రభ ఒంటరిగా స్కూలుకి వెళుతూ కనిపించింది. ఆ సమయంలో, ఆ పరిస్థితిలో ప్రభ ఎంతో అదృష్టవంతురాలిలా అవుపించింది రాధకు.

తదాదిగా రాధలో ఉత్సాహం చచ్చిపోయింది. మందకొడిగా, ఏదో ఆలోచిస్తున్నట్టు కనిపిస్తుంది. ఆమెలో అమితోత్సాహంతో ఉరకలువేసిన విద్యాసక్తికి ఆటంకం కలగగానే అనంతమైన నిరాశ నిస్పృహలు, మనసును గ్రహించని తల్లిదండ్రులపై కోపంవల్ల ఏర్పడిన ఒంటరితనం ఆమెలో గూడుకట్టుకొన్నాయి. ఎక్కడికీ వెళ్లటంలేదు. చివరికి వీధివాకిట్లోకికూడా వెళ్లక తన గదిలోనే, అర్థాంతరంగా తన చదువు ఆగిపోయిన తరవాత మిగిలిన జ్ఞాపకాలుగా నిలిచిన క్లాసుపుస్తకాల్ని తిరగేస్తూ కాలక్షేపం చేస్తూంది రాధ.

* * *

ఆ రోజు కార్తీక సోమవారం! పగలల్లా ఉపవాసం ఉన్న రాధ సాయంత్రం గుళ్ళోకి రానని ససేమిరా మొండికేసి కూర్చుంది. తల్లి మందలించింది. బామ్మ కూకలేసింది. తండ్రి ప్రాధేయపడ్డాడు. అయినా రాధ మరింత బిగుసుకుపోయింది.

"రాను! రాను! ఏమిటీ బలవంతం? ఇంటికి పెద్దదాన్ని ఇలా బయటకు 'తగుదునమ్మా' అని బయలుదేరితే నలుగురూ నవ్వరూ?" ఉక్రోషంతో ఆమె ముఖం అరుణిమ దాల్చింది.

రాధ మనసులో గాయం ఇంకా మానలేదని గ్రహించారు అవధానిగారు.

బామ్మ ముసుగు పైకి లాక్కుంటూ, "ఏమిటే

ఈ తొందరపాటులు? గుళ్ళోకి రాకపోతే ఈ ఉపవాసం ఎందుకున్నావు? ఆ ఫలితమంతా బూడిదలో పోసిన పన్నీరే! నోరు మూసుకుని ఆ మడిచీర కట్టుకో!'' అంది.

''మువ్వూరుకో, జానమ్మా! అన్నిటికీ! . . . అసలు నీవల్లనే నే నిలా కొంపలో జీవచ్ఛవంలా పడిఉండటం.''

అన్నపూర్ణ కలగజేసుకుంది.

''నోరు మూసుకో అంతటితో! చిన్నంతరం, పెద్దంతరం ఉండద్దూ? ఇప్పటినుంచే ఇంత మొండితనమా? మంచిగా ముందు బయలుదేరుతావా లేదా?'' గర్జించింది.

''పోనీ... అది అంతగా రానంటూంటే ఉండనీయ రాదా?'' అవధానిగారు అన్నారు.

''మీ రూరుకోండి! అసలు మీ అలుసు చూసుకునే అది ఇంత చెలరేగుతూంది!''

మనస్సులోని భావాలకు విరుద్ధంగా తల్లి ఆజ్ఞను పాటించక తప్పలేదు రాధకు.

ప్రఫుల్లమైన మనస్సుతో, ప్రశాంతమైన చిత్తంతో భక్తిప్రపత్తులు ముప్పిరిగొనగా ఈశ్వరుని దర్శించవలసినది. కానీ రాధ మనస్సులో ఇందుకు పూర్తిగా విరుద్ధమైన సంఘర్షణ జరుగుతూంది.

'ఛీ! తన నెవరూ అర్థంచేసుకోరు. అసలు ఆడదిగా పుట్టటమే ఒక శాపం! ఇలాంటి ఛాందసుల కడుపున పుట్టి, తన మనస్సుకు వ్యతిరేకంగా నడుచుకో వలసిరావటం మహా పాపం!

ఇంత అయిష్టంగా తనని దర్శించుకోటం భగవంతుడు మెచ్చుతాడా? అసలు ఇదంతా ఆయన నడిపించే నాటకమే. ఆయన అనుగ్రహమే ఉంటే తనిలా కుళ్లిపోవాల్సిన అవసరమేమిటి?'


ప్రమిదలో వత్తుల్ని వెలిగించి శివలింగాన్ని మనస్సులో నిలుపుకుని అనుకున్నది రాధ.

'తిమిరాంధకారాన్ని పారద్రోలే జ్యోతుల్ని వెలిగించాను. శంకరా! నా తలిదండ్రుల మనస్సులోని సంకుచితమనే, ఛాందసమనే చీకటిని చీల్చి జ్యోతుల్ని వెలిగించు ప్రభూ! నా ఈ అపారమైన విద్యాతృష్ణ ఎందుకూ కొరగానిది. నాలో అది నశింపజెయ్యి. భగవాన్! నాకు మనశ్శాంతిని ప్రసాదించు.'

* * *

రాధలోని వ్యాకులతను అర్థంచేసుకున్న అవధానిగారు ఆలోచించారు. 'ప్రతి మనిషికీ ఏదో ఒక వ్యాపకం ఉండాలి. లేకపోతే అర్థంలేని ఆలోచనలతో జీవితాన్ని, మనస్సును పాడుచేసుకుంటారు. రాధ తన కోరిక నెరవేరలేదనే వేదనతప్పించి, పరిస్థితి నర్థంచేసుకోక అకారణంగా తను బాధపడుతూ, ఇతరులనొప్పిస్తూంది. సమస్త మనోవ్యాధులకూ సంగీతం పరమౌషధం లాంటిది. ఆ సంగీతస్రవంతిలో జీవితంలోని ప్రతి సుఖమూ, కష్టమూ, బాధలూ, దుఃఖాలూ గడ్డి పరకల్లా అప్పిస్తాయి. మనస్సులోని అశాంతిని దూరం చేసి, వివ్వరించలేని అనుభూతినిస్తుంది గానం. అవును. అదొక్కటే రాధ మనస్సుకు తృప్తినిచ్చేది.'

తనకు పరిచయమున్న ఓ సంగీతం మేస్టారితో సంప్రదించారు అవధానిగారు. ఫలితంగా మూడోనాటికి సరికొత్త వీణ ఇంట్లో ప్రత్యక్షమయింది. రాధలోని నగంభారం తగ్గింది. అందంగా, ముచ్చటగా ఉన్న వీణను తదేకంగా చూస్తూ, 'తల్లీ! సరస్వతీ! నామీద



అనుగ్రహించి ఈ రూపంలో అవకాశమిస్తున్నావా? ధన్యురాల్ని! ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకుని ప్రావీణ్యం సంపాదిస్తాను.' చెమ్మగిల్లిన కనులు తుడుచుకుంటూ అనుకున్నది.

* * *

స్నేహితురాలు ప్రభ వచ్చింది రాధకోసం. ఇద్దరూ పెరట్లో విరజాజిపందిరిపక్కగా నులక మంచంమీద కూర్చున్నారు. రాధ చెల్లెలు విజయ పళ్లెంలో పూలూ, దారపు రీలూ తెచ్చి అక్కకు ఇచ్చింది కట్టమంటూ. ఒళ్లో పళ్లెం ఉంచుకుని విరజాజుల్ని కడుతూ అన్నది రాధ: ''అయితే నిన్నింకా చదివిస్తారన్నమాట!'' అదోవిధమైన బాధ ధ్వనించిందా మాటలలో.

''అవును, రాధా! మా అమ్మ వద్దని గోల చేసింది. కానీ నాన్న పట్టుపట్టారు. మొదట్లో సణిగి, సాధించింది. చివరకు చేసేదిలేక మెదలకుండా ఊరుకుంది అమ్మ. ఈ ఏడు స్కూల్‌ఫైనల్ పాసయితే. . . పట్నంలో పిన్నిగారింట్లో ఉంచి ఇంటర్‌కూడా చదివిస్తానంటున్నారు నాన్న!'' సంతోషంతో, గర్వంతో ప్రభ కళ్ళు మెరిశాయి.

''అదృష్టవంతురాలవు!'' సాలోచనగా అన్నది రాధ.

''నేనూ మానకుండాఉంటే ఈపాటికి స్కూల్ ఫైనల్‌లో ఉండేదాన్ని'' అన్నది మళ్లీ రాధే.

''ఇప్పుడుమాత్రం నీకేం తక్కువమ్మా? అనవసరంగా ఏవేవో ఆలోచనలతో దిగులుగా కనిపిస్తావుగానీ! అది సరే, ఇంతకూ అత నెలా ఉంటాడు?''

''ఎవరు?'' పరధ్యాన్నంగా అన్నది.

''అబ్బో! నటనకూడా నేర్చుకున్నావా?''

''ఏమిటి, ప్రభా, మవ్వనేది?''

''నాకు తెలీదనుకుంటున్నావా? వచ్చే మాఘమాసంలోటగా పెళ్లి. ముహూర్తాలు పెట్టుకోలేదూ!''

రాధ నిశ్శబ్దంగా ఊరుకొంది. కొంతసేపయ్యాక ''ఇంకేమన్నా సంగతులు చెబుదూ'' అన్నది.

''నా మాట దాటేస్తున్నావు. కాబోయే వరుడు ఎలా ఉంటాడు?''

''ఏమో!'' తల కిందికి వాలిపోయింది.

''అప్పుడే మరిచిపోయావా? నేను నమ్ముతాననే! గుర్తుతెచ్చుకోవోయ్!''

మొగ్గపై చిరుగాలి వీచినట్లు సిగ్గుతెరలు రాధను చుట్టుముట్టాయి.

''నిజం, ప్రభా! నే నంత సాహసురాలి ననుకుంటున్నావా? అతన్ని అసలు చూడనేలేదు నేను.''

''నిజంగా చూడలేదూ? చూడందే ఎలా నచ్చాడు నీకు? అసలు నీ పెళ్లికి నీ ఇష్టం అక్కర్లేదా?'' వింతగా అడిగింది.

''ఇంకా ఆ యుగం రాలేదు, ప్రభా! అమ్మ ఇష్టం బామ్మ, నాన్నల ఇష్టం! వాళ్ల ఇష్టమే నా ఇష్టం!''



నిశ్చలంగా ఉన్నాయి మాటలు.

"అంటే నీకో అభిప్రాయమంటూ లేదా?"

"లేదు. ఒకవేళ ఉన్నా, విలువేముంది?"

"ఇంత నిర్విచారంగా ఎలా ఉంటున్నావు? నీకు చూడాలని ఉండదా?"

"ఉండదు!"

ప్రభ మరి మాట్లాడలేదు. రాధవైపే ఆశ్చర్యంగా చూస్తూ కూర్చుంది.

'పదునాలుగో ఏడు నడుస్తున్న రాధ కుందనపు బొమ్మలా చూడముచ్చటగా ఉంటుంది. సన్నగా, పొడుగ్గా ఉన్న రాధ చూపరులదృష్టిని ఇట్టే ఆకర్షిస్తుంది. నిర్మలంగా, విశాలంగా ఉన్న నేత్రాలు ఓ ఆకర్షణ!' నిశితంగా పరిశీలించిన ప్రభ అనుకున్నది.

'అందమంటే రాధ అని నిర్వచనంగా చెప్పుకునే ఈ దొండపండుకు కాకిముక్కులాంటి భర్త నివ్వకు, భగవంతుడా!'

* * *

రమణారావు కాకిముక్కులా ఉండడుగానీ, రాధ ముందు తీసికట్టే. ఒడ్డూ పొడుగూ ఉండి చామన చాయలో హుందాగా ఉంటాడు. నాలుగు వందలు సంపాదించే ఉద్యోగం ఉన్నది. తినటానికి గింజలిచ్చే పొలం ఉన్నది. అంతా "అదృష్టవంతురాలు రాధ" అన్నారు.

రాధ మనసులోమాత్రం ఏ భావం లేదు. మబ్బులు లేని ఆకాశంలా నిర్మలంగా, నిశ్చలంగా ఉన్నది.

అత్తగారింటికి వెళ్ళే రోజు దగ్గిర పడింది.

పైకి గంభీరంగా ఉన్నా మనసులో బాధ పడుతున్నా రంతా.

రాధ బామ్మ సరేసరి. పదేపదే రాధను దగ్గిరకి తీసికొని కన్నీళ్ళు పెట్టుకుం. ఎప్పుడూ [illegible] చేశావని, ఇలా నడవమని, ఆడపిల్ల లక్షణాలివి [illegible] అంటూ సాధించి కోప్పడే బామ్మ, కన్నీళ్ళు పెట్టుకోటం రాధకు ఆశ్చర్యమనిపించింది. బామ్మ ఏడుపు వింటూంటే రాధకుకూడా ఎందుకో దుఃఖం పొర్లుకొచ్చింది. అన్నపూర్ణ చెప్పింది కూతురికి, అత్తింటికోడలి లక్షణాలు. అన్నిటికీ మౌనంగా తన అంగీకారాన్ని తెలిపింది రాధ.

* * *

రమణారావు మాటలకు రాధ మనసు ఉప్పొంగిన ఉదధిలా పరవళ్ళుతొక్కింది. కళ్ళలో కోటి ఆశలు తళుక్కుమనగా "నిజంగా!" అన్నది.

"నిజమే, రాధా! దేని కింత ఆశ్చర్యం? నీ కంత కోరిక ఉన్నప్పుడు చంపుకోటం దేనికి? మంచిరోజు చూడు, మొదలుపెడదాం!"

ఆ ఆనందంలో రాధ మనసు నాట్యంచేసింది.

"మీరు... మీరు... నిజంగా దేవుడు!" అప్రయత్నంగా భర్త పాదాలను స్పృశించింది. ఆమెను వారిస్తూ లేవనెత్తి హృదయానికి హత్తుకుంటూ, "నువ్వు నిజంగా పిచ్చిరాధవు సుమా!" అన్నాడు చిలిపిగా ఆమెను అనుకరిస్తూ.

చటుక్కున ఏదో గుర్తువచ్చినదానిలా ఉలిక్కిపడింది రాధ.

"ఇదంతా అత్తగారికి తెలిస్తే బాగుంటుందా?"

"ఇందులో తప్పేం ఉన్నది? అవక్తైనా తెలియ వలసిన అవసర మేమున్నది? రాత్రి భోజనాలయిన తరవాత కొంచెంసేపు చెబుతాను."

కృతజ్ఞతగా చూసింది రాధ.

* * *

మంచినీళ్ల మరచెంబు టేబిల్‌మీద ఉంచి, డ్రాయర్‌లోని పుస్తకాల్ని తీసింది రాధ. టెక్స్టుపుస్తకం భర్తముందు పడేసి నోట్సు సిద్ధంచేసుకుంటి, పెన్ను కేప్ తీస్తూ.

పుస్తకాన్ని ప్రక్కగా విసిరేసి రాధచేతిని పట్టుకుని ముందుకు లాక్కున్నాడు రమణారావు.

చేతిలోని పెన్నుపాళీ రాధ అరచేతిలో గుచ్చుకుంది.

"అబ్బా! ఏమిటిది? రోజూ ఇంతేనా? ఎన్ని చెప్పారు! అన్నీ అబద్ధాలేనా?"

"పోనిద్దూ! ఎదురుగా నీ విలా తెల్లచీరలో అందంగా కనిపిస్తూంటే ఏం చెప్ప బుద్ధిపుడుతుంది?"

"అయితే నేనేం చేయను చెప్పండి? రోజూ ఇలానే అంటున్నారు. అప్పుడే నేను వచ్చి మూడు నెలలు దాటుతూంది. ఇంతవరకు ఒక్క స్పోరటన్నా చెప్పారా?"

"రేపు చూద్దాంలే!"

రాధ మరి మాట్లాడలేదు. ఏదో నిరాశాభావం మొలకెత్తిం దామెలో. అది రోజురోజుకూ వృద్ధి చెందుతూ ఆమెలోని ఆశల్ని సమూలంగా నాశనం

చేసింది.

ఒక రోజు గట్టిగా నిలదీసింది భర్తని. .

"అసలు మీ కిష్టంలేదని చెప్పరాదూ? ఎందు కిలా మభ్యపెట్టడం?"

"వస్తూనే ఏమిటీ సాధింపు? పగలంతా ఆఫీసులో పని. రాత్రి నీకు ట్యూషన్‌కూడా మొదలుపెడితే నేను బ్రతకాలనేనా?" విసుగ్గా ఉన్నది అతని కంఠస్వరం.

మరోరోజు . . .

"నన్నెందుకిలా ఆడిస్తారు? నాలో నిద్రాణమై ఉన్న ఆశల్ని మేలుకొలిపి చివరి కిలా మోసం చేస్తారా?"

"మోసమా? మోసమేమిటి? మొదట్లో నా కా ఉద్దేశ్యం ఉన్న మాట నిజం! తరవాత ఆలోచించినమీదట నీ కోరికలో అర్థం లేదనిపించింది. నువ్విప్పుడు పరీక్షలు పాసయి ఎవర్ని ఉద్ధరించాలి? ఉద్యోగం చేయాలా? ఊళ్లేలాలా?"

"విద్య దానికేనా వినియోగపడేది?"

"మరి?" నవ్వాడు. "పిచ్చి పిచ్చి ఆశలు మనసులోనికి రానీయకూడదు. మన సంప్రదాయం ప్రకారం ఆడపిల్ల అణకువగా, వినేయతగా ఉండాలి. దానికి ఎంత అమాయకంగా ఉంటే అంత మంచిది. ఇంక మరెప్పుడూ ఈ ప్రస్తావన ఎత్తకు—తెలిసిందా?" అతని మాటల్లో మృదుత్వంకన్నా కఠినత్వమే గోచరించింది రాధకు.

"చివరికి . . . మీరుకూడా నన్ను. . ." మిగిలిన మాటల్నీ, కనురెప్పలమాటున దుఃఖాన్నీ మింగివేసింది రాధ, కల్లోలితమైన మనసు నదుపులోకి తెచ్చుకుంటూ.

* * *

మధ్యాహ్నభోజనా నంతరం తన గదిలోకి వచ్చి మంచంమీద పడుకున్నది రాధ. ఏ విధమైన మార్పు లేని తన జీవితాన్ని తలుచుకుని నిశ్వసించింది. దుస్సహమైన మనోవ్యథ భరించలేక, తనతో ప్రాణంగా అత్తగారింటికి తెచ్చుకున్న వీణను పైకి తీసి దుమ్ము దులిపింది. శ్రుతి సరిచేసి తన కిష్టమయిన మోహనరాగం వాయించటం మొదలుపెట్టింది. సర్వ ప్రపంచాన్నీ తన మహత్తరమైన తన్మయతలో ముంచివేయగల శక్తి ఒక్క గానానికే ఉన్నది. బాధలూ, బరువులూ ఆ గానలహరిలో కొట్టుకుపోతాయి. చాలారోజుల తరవాత తిరిగి వీణ వాయించటంతో రాధలో అనిర్వచనీయమైన తృప్తి ఏదో చోటు చేసుకుంది. నిమిషాలూ, గంటలూ అలా అవిచ్ఛిన్నంగా దొర్లిపోతున్నాయి.

జీవితంలో దురదృష్టం కళ్లు తెరిచినప్పుడు పరిస్థితులు కావలా కాస్తాయట!

రాధ గది తలుపులు విసురుగా తెరచుకోవటం, భర్త రమణారావు రౌద్రస్వరూపంతో ప్రత్యక్షమవటం జరిగింది.

"ఏమిటే వంత? అవతల నాన్న నిద్రబోతూఉంటే, నీ ప్రావీణ్యమంతా ఇప్పుడేనా?" విసురుగా చేతిలోని వీణను లాక్కుని పెట్టెలో పడేశాడు. ఆ విసురులో వీణతీగెలు పుటుక్కుమని తెగిపోవటం గమనించనేలేదు అతను.

"అందంగా, ముగ్ధలా అలంకరించుకొని చేతిలో వీణను మీటుతూ అపరసరస్వతిలా సాక్షాత్కరించావు ఆ రోజున. అప్పుడే అనుకున్నాను నువ్వు నాకోసం దివినుండి భువికి దిగివచ్చిన అప్సరసవని. ఎంత





లాజిన్



పేలు, ఈపి, చుండ్రు నివారిణి.

అన్ని షాపులలో అమ్మబడును

డిస్ట్రిబ్యూటర్లు:—

శ్రీనివాస మెడికల్ & ఫాన్సీ మార్టు

రేపల్లె, గుంటూరు జిల్లా.

11-42-45, రాంగోపాల్ వీధి, విజయవాడ-1.

595, పతంగె బిల్డింగ్సు, సిద్ధింబజార్,

హైదరాబాద్; 12/62, మెయిన్ రోడ్డు, వరంగల్.

గీరుకోకండి!

చర్మవ్యాధులకు వాడండి.

ఎగ్జిమా, రింగ్‌వామ్, స్కేబీస్ మున్నగు చర్మ వ్యాధుల నుండి మీకు త్వరగా, నిరపాయంగా, పూర్తి నివారణము లభించును.

అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంట్




తయారుచేయువారు: అమృతాంజన్ లిమిటెడ్, మద్రాసు-4.



మనోహరంగా వాయించావు త్యాగరాజకృతి, రాధా! నువ్వు నిజంగా నా అదృష్టదేవతవు." మొట్టమొదటి సారిగా మాట్లాడిస్తూ వివాహమయిన కొత్తల్లో రమణారావు అన్న మాటలు గుర్తువచ్చాయి రాధకు.

మౌనముద్రాంకిత రాధ బెదురుగా లేచి నిలబడింది. నేలపై చూపులు గుచ్చి, విషాదంగా నిట్టూర్చింది.

"ఇంకెప్పుడూ ఆ వీణను పైకి తీయకు! ఇదేమైనా సానికొంపనుకున్నావా?"

"భయపడకండి! తీగెలు తెగిన ఆ వీణ ఇక పలకదు!" నీరసంగా అన్నది రాధ.

ఆమె మాటల్లోని దైన్యం, ముఖంలోని భావ ప్రకటన ఎంతటి రాతిగుండెనయినా కరిగించక మానవు. రమణారావు కా సమయంలో అవేవీ కనిపించ లేదు. తన కోపతోరణికి భయపడి వైదొలగక నిర్భయంగా, నిశ్చలంగా నిలుచున్న రాధవైఖరి మరింత కోపకారణమయింది.

"ఆడది ఒక సమస్య అంటారు. కానీ ఆడదాన్ని ఎలాంటి హద్దుల్లో ఉంచాలో నాకు బాగా తెలుసు!"

విచిత్రంగా చూసింది అతనివైపు, పొంతనలేని మాటలకు.

"రాధా, నువ్వు ఆడదానివి. నీకు భర్తే దైవం! ఇది నేను చెప్ప నవసరం లేదనుకో. కానీ, నిన్న చెల్లాయితో ఏమిటా వాగుడు?"

"ఏమన్నాను?"

"నా నోటితో చెప్పించాలనా? నీకు ఎమ్. ఎ. దాకా చదవాలని ఉన్నదనీ, నీ స్నేహితురాలు ఇంటర్ చదువుతూందనీ, నీ దురదృష్టమే నిన్నీస్థితిలో ఉంచిందనీ . . ."

'చివరి మాట అక్షరాలా సత్యం!' మనసులో అనుకుని పైకి, "ఆపండి! నేను చెప్పింది మరో ఉద్దేశంతో" అన్నది.

"ఏ ఉద్దేశమైనా సరే! వాక్స్వాతంత్ర్యానికికూడా హద్దు ఉండాలి!"

"క్షమాపణ కోరుకుంటున్నాను!"

వెళ్లిపోయాడు రమణారావు.

రాధ గది తలుపులు మూసుకుని మంచంమీద బోర్లాపడుకుని దిండులో తల దూర్చింది. అంతవరకూ గాంభీర్యంవెనక అణిచిపెట్టుకున్న దుఃఖం పొంగి పొర్లింది.

ఆడదానికి నీళ్లకుండ నెత్తిన ఉంటుందంటారు. ఒక విధంగా స్త్రీకి అది వరప్రసాదమే. ఆ నీళ్లకుండే లేకపోతే మనసులోని ఆవేదనజ్వాలల్లో మండి మసైపోయేది స్త్రీ. ఆమెలోని అభిజాత్యానికీ, బాధకూ, నైరాశ్యానికీ, అవమానానికీ కన్నీళ్లే తేలిక ఇచ్చేది. ఎప్పటికప్పుడు బాధని, అవమానాన్ని, అగౌరవాన్ని కడిగేస్తుం దా కన్నీరు.

* * *

చెంపకు చేయి ఆన్చి, కనులు మూసుకొని, అలసటగా మంచంమీద ఓరగా పడుకుంది రాధ. రమణారావు చదువుతున్న పుస్తకాన్ని మూసి, లైట్ ఆఫ్‌చేసి, ట్రాన్స్‌ఫార్మర్ వెలిగించి రాధను సమీపించాడు. మృదువుగా ఆమెను తట్టుతూ పిలిచాడు.

"రాధా!"

"ఊఁ!"

"నిన్నో సంగతి అడుగుతాను. నిజం చెబుతావా?"

"ఎప్పుడైనా అబద్ధం చెప్పానా?"

"అదిగాదు. ఆ రోజున పెళ్లిచూపులనాడు నన్ను చూడగానే ఏమనిపించింది నీకు?"

క్షణంసేపు నిశ్శబ్దం నిలవదొక్కుకుంది.

"ఏమో!"

"గుర్తులేదా?"

"కాదు, మిమ్మల్ని నేను చూడలేదు."

"పోనీ. . . చూసినప్పుడు?"

"ఏం అనిపిస్తుంది?"

"అంతేనా?" నిరాశ ధ్వనించింది.

"అవును!"

"ఛీ! అసలు నువ్వు ఆడదానివేనా?"

ఉలిక్కిపడింది రాధ.

"కన్నెపిల్లల మనస్సులో ఎన్నో ఆలోచనలు, కోరికలు ఉంటాయిట! కాబోయే భాగస్వామినిగూర్చి కలలు కంటారు సాధారణంగా! అలాంటిది నన్ను చూడగానే ఏ భావమూ లేదంటే నేను నమ్ముతాననేనా?"

"కానీ నాలో అలాంటి ఊహ లెప్పుడూ రాలేదు. మిమ్మల్ని చూడగానే అమ్మా, నాన్నా నా జీవితంలో ఎంతటి ముఖ్యులో, మీలోనూ అటువంటి ప్రాధాన్యమే కనిపించింది. అంతే!"

"సరే! నువ్వు నిద్రపో! నిన్ను కదిలించటం నాదే పొరపాటు."

ఏదో చెప్పాలని ప్రయత్నించి విఫలురాలయింది రాధ.

* * *

రాధకు ఆడపిల్ల పుట్టింది.

పదిహేనేళ్ల రాధ తల్లి అయింది.

పొత్తిళ్లలో చేతులూ, కాళ్లూ కుదుపుతూ, అస్పష్ట ధ్వనిచేస్తూ కదిలే పాపను నిమిషమాత్రం తదేకంగా చూసింది రాధ.

'దీని భవిష్యత్తు ఎలా రాసిపెట్టి ఉన్నదో!' అనుకున్నది నిట్టూర్చుతూ. అంతటితో ఊరుకోలేదు తల్లిగా తను నెరవేర్చాల్సిన బాధ్యతల్నిమించి అనురాగాన్ని పిండి పెంచింది. ఆశయాల్ని రంగరించి తీర్చి దిద్దింది. అనుభవాల నేర్పుతో బోధించింది. ఆ పాప ఆమెకు ఆరోప్రాణం! తన తీరని ఆశల ప్రతిరూపం!

తరవాత సంతతికి ఇంతటి ప్రాధాన్యం ఇవ్వలేదు. రాధ కలల వెలుగు పెరిగి పెద్దదవుతున్నది.

ఆ రోజున హఠాత్తుగా ప్రభ వచ్చింది రాధ కోసం. విద్య ఇచ్చిన విజ్ఞానపు వర్చస్సుతో ప్రభ నిరాడంబరంగా, అందంగా ఉన్నది. తన ఈడు రాధకు తన పెళ్లి శుభలేఖ ఇచ్చింది.

"తప్పక వస్తావు కదూ, రాధా?"

నలుగురు పిల్లల తల్లి రాధ నిర్లిప్తతగా నవ్వింది.

"అడుగుతాను!"

"ఇప్పటికికూడా నీలో నిరాశాభావం వదలలేదు. నీ జీవితం నీకు సంతృప్తినీయటంలేదా?" నిశితంగా చూస్తూ అడిగింది ప్రభ.

"ఇవ్వకేం! నే నిప్పుడు చాలా హాయిగా ఉన్నాను."

"అబద్ధమాడటంకూడా ఒక కళ, రాధా! అది అందరికీ చేతకాదు!"

"వరు డెలా ఉంటాడు?" మాట మార్చింది రాధ.

"నాకు నచ్చారు. ఇద్దరం ముందు మాట్లాడుకుని ఈ నిర్ణయం తీసుకొన్నాం!"

వెనకటి సంగతేదో గుర్తువచ్చింది రాధకు.

"అదృష్టవంతురాలివి!" అన్నది అప్రయత్నంగా

"సరే! నే వెళ్లివస్తాను. నువ్వు తప్పక రావాలి సుమా!"

చిరునవ్వు పూయించింది రాధ తటస్థంగా.

వెన్నెలరేఖలాంటి ప్రభ వాకిట్లోకి వెళ్లి [illegible] అలాగే చూస్తుండిపోయింది రాధ

కాలచక్రంలో కొన్ని సంవత్సరాలు రూపులు మార్చుకొన్నాయి. రాధ ప్రతిరూపం 'పాప'కు యుక్తవయస్సు వస్తోంది. కాలం రాధలోని భయాందోళనల్ని, పిరికితనాన్ని పారద్రోలి, తెగింపు మిగిల్చింది.

భర్తను ప్రతిఘటించి పాపను కాలేజీలో చేరిపించింది. రమణారావుతో తీవ్రంగా వాదులాడి పాపకు వీణావాయిద్యం నేర్పిస్తోంది. సహజంగా చురుకుపాలు ఎక్కువఉన్న పాప అన్నింట్లోనూ ప్రావీణ్యం సంపాదించింది. కానీ, రాధ దురదృష్టమేమో, పాప నొసటివ్రాతో ఆ ఏడు పరీక్ష తప్పింది పాప!

నలుగురిలో ప్రత్యేక వ్యక్తిగా నిలిచిన 'పాప' ఆ



ఛాయా పురుషలక్షణం

ఫోటో—ఆర్. ఎ. జంసాండేకర్ (డోంబివ్‌లీ)

అవమానాన్ని జీర్ణించుకోలేక, అంతటితో చదువు చాలిస్తానని మొండికెత్తి కూచుంది.

* * *

జయప్రద చెమర్చిన కన్నుల్ని అద్దుకుని, వైదేహి వైపు సానునయంగా చూస్తూ, "ఇప్పుడు చెప్పు, పాపా! ఆ రాధ మనోవ్యథ ఏ రూపంలో ఉంటుందో!" అన్నది.

ఏకదీక్షగా, శ్రద్ధగా తల్లి చెప్పినది విన్న వైదేహి ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఊరుకుంది.

"అమ్మా! నిన్నర్థం చేసుకున్నాను. నీ ఆశలని భగ్నంచేయనమ్మా! నువ్వే ఆ రాధవని గ్రహించానమ్మా! నన్ను క్షమించు, నా అవివేకానికి!"

"పాపా!" ఉద్వేగంతో లేచివచ్చి వైదేహిని ఆలింగనం చేసుకుంది జయప్రద.

బయట వర్షం తగ్గి ప్రశాంతంగా ఉన్నది.

మబ్బుల్ని చీల్చుకుని సూర్యకిరణాలు జగత్తు నావరించాయి. ★